క్లుప్తంగా

బడ్జెట్ ప్రతుల దహనం



దాచేపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను సీపీఐ నాయకులు బుధవారం దహనం చేశారు. పేదలు, కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్‌లకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కొమెర వెంకట్రావ్, పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, నాయకులు ఎడ్ల భాస్కర్ రావు, పత్తిపాటి నాగరాజు, గంగారం, వలి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



దాచేపల్లి : మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునశర్మని యూటీఎఫ్ నాయకులు బుధవారం సన్మానించారు. ఇటీవల ఆయన దాచేపల్లి ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. 2025 యూటీఎఫ్ పాకెట్ క్యాలెండర్‌ని ఎంఈఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టివు నాగేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షుడు పి.రాజారావు నాయకులు పాల్గొన్నారు.

ఆలయ భూముల రీసర్వే



మల్లవరం(రెంటచింత): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఆలయ భూములన్నీ రీసర్వే చేసి డేటాను ఆన్‌లైన్ చేయిస్తున్నట్టు దేవదాయశాఖ ఈఓ గాదె రామిరెడ్డి బుధవారం తెలిపారు. మల్లవరం గ్రామంలోని సర్వే నంబర్ 32-3లో ఉన్న 3.93 ఎకరాల నీలకంటేశ్వరస్వామి ఆలయ భూములను రీసర్వే బృందాలతో యంత్ర పరికరాలతో కొలతలు వేసి డేటాలో ఎంట్రీ చేయించినట్లు తెలిపారు. పూర్వకాలం నుంచి భూమి చుట్టూ ఉన్న హద్దులలోని భూమిని మాత్రమే రీసర్వే చేయించినట్లు వెల్లడించారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా



రెంటచింతల: ప్రజా ప్రతినిధులు, గ్రామ, మండల స్థాయి అధికారుల సహకారంతో ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తహసీల్దార్ మూఢావత్ అర్జున్‌నాయక్ అన్నారు. బుధవారం కార్యాలయంలో తహసీల్దార్‌ను స్థానిక టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, మున్నా ప్రభురాజు, గోగుల పుల్లారెడ్డి, మూలి రాయపురెడ్డి, తుమ్మా జోసఫ్‌రెడ్డి, మున్నా లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కందులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రెంటచింతల: కంది పంటను రైతులు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందులు కొనుగోలు కేంద్రాన్ని ఆయన మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు వద్ద నుంచి మద్దతు ధర రూ. 7,550లకు కందులు కొనుగోలు చేస్తారని వివరించారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన



మాచర్ల: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం వద్దనున్న అన్నా క్యాంటీన్‌ను మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు బుధవారం సందర్శించారు. నిర్వాహకులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఎందుకు ఆలస్యంగా వస్తోందని ప్రశ్నించారు. అల్పాహారం ఎలా ఉందని అక్కడ ఉన్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అల్పాహారాన్ని రుచి చూశారు.

పీఆర్కే కార్యాలయం వద్ద సందడి

మాచర్ల: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నాలుగు రోజులుగా మాచర్లలోని తన కార్యాలయంలో అభిమానులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. దీంతో నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివస్తున్నారు. పిన్నెల్లి ప్రతి ఒక్కరినీ కలిసి ఆత్మీయంగా పలకరిస్తున్నారు. సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. బుధవారం మాచర్ల పట్టణంతోపాటు, రెంటచింతల, వెల్దుర్తి, కారంపూడి, విజయపురిసౌత్, వివిధ ప్రాంతాలకు చెందిన అభిమానులు భారీ స్థాయిలో తరలిరావటంతో కార్యాలయం వద్ద జన సందడి నెలకొంది.

పార్టీ నేతకు పరామర్శ

మాచర్ల మండలం భైరవునిపాడు గ్రామానికి చెందిన బోయ మాధవరెడ్డిని బుధవారం పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఇబ్బంది పడుతున్న బోయ మాధవరెడ్డిని ఎంఎస్ఆర్ టౌన్‌షిప్‌లోని ఆయన స్వగృహంలో పిన్నెల్లి కలిశారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పీఆర్కే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు జింకల వెంకటేశ్వర్లు, బోయ మల్లారెడ్డి, శ్రీనివాసనాయుడు ఉన్నారు.



కార్యకర్తలు, అభిమానులతో పిన్నెల్లి



అనారోగ్యానికి గురైన బోయ మాధవరెడ్డిని పరామర్శిస్తున్న పీఆర్కే

రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్ అది

పిడుగురాళ్ల: కేంద్ర బడ్జెట్ రైతు, కార్మిక వ్యతిరేకంగా ఉందని రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని బ్యాంక్ సెంటర్‌లో బుధవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. గోపాలరావు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరిచారు. ప్రధాని మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. రైతులను ఆదుకునేందుకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీను, రైతు కూలీ సంఘం నాయకులు రాంబాబు, నాయకులు దేవ్వళ్ల భూలక్ష్మీ, దంపతి వెంకట కృష్ణ, మద్దిరాల సైదులు, గుంటి నాగేశ్వరరావు, సుజాత, దేవి, అన్నపూర్ణ, రామయ్య, మామిడాల శ్రీను, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

తంగెడలో రెవెన్యూ అధికారుల పర్యటన

దాచేపల్లి : తంగెడ గ్రామంలో రెవెన్యూ అధికారులు బుధవారం పర్యటించారు. గ్రామంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం సీఎస్ఆర్ కార్యక్రమాలు నిర్వహించటంలేదని ఇటీవల గ్రామస్తులు కలెక్టర్‌కు, ఆర్డీఓకు ఫిర్యాదులు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. తమ గ్రామంలో సీఎస్ఆర్ పనులు చేయకుండా యజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని, ఇచ్చిన హామీలను అమలు చేయటంలేదని గ్రామస్తులు ఆర్డీఓకు వివరించారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్ము, ధూళి వల్ల పంటలు నష్టపోతున్నామని వివరించారు. గ్రామస్తుల సమస్యలపై ఆర్డీఓ మురళీకృష్ణ యజమాన్య ప్రతినిధులతో చర్చించారు. తాము సీఎస్ఆర్ పనులు చేస్తున్నామని, మిగిలిన పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని యజమాన్య ప్రతినిధులు ఆర్డీఓకు చెప్పారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. రైతులు సాగు చేస్తున్న పంటలు పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మురళీకృష్ణ తెలిపారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీఓ పప్పుల రత్నం, ఆర్ఐ శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థుల సమస్యలు వింటున్న ఆర్డీఓ మురళీకృష్ణ.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

మాచవరం : మండలంలోని మోర్జంపాడులో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పూజా కార్యక్రమాలు, గ్రామ వీధుల్లో స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, భజనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్వామి కల్యాణోత్సవం, రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహిసున్నట్లు వెల్లడించారు. 8 నుంచి 11 వరకు ఎడ్ల బల ప్రదర్శన పోటీలు స్వామి కల్యాణోత్సవం సందర్భంగా 8వ తేదీ నుంచి 11 వరకు జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజాల బండ లాగుడు బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 8న జత పళ్ల విభాగం, 9న పాల పళ్ల, నాలుగు పళ్ల విభాగం, 10న సేద్యపు విభాగం, జూనియర్ సైజు, 11న సీనియర్ సైజు, (జాక్‌పాట్) పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామికి మొక్కుబడులు చెల్లిస్తారన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

పిడుగురాళ్ల: సమాజంలో బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తానూరి కృష్ణకుమారి చెప్పారు. పట్టణంలోని రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కృష్ణకుమారి మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టే దశలో ఎదరయ్యే సమస్యలను స్థానిక పోలీస్, రెవెన్యూ, ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ సిబ్బందికి తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ నూర్జహాన్, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ కరీముల్లాతోపాటు హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపల్ వనజ, ఏఎన్ఎం ఉషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తానూరి కృష్ణకుమారి

అధిక లోడుతో వాహనాలు నడిపితే చర్యలు

క్రోసూరు: అధిక లోడుతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ నాగేంద్రరావు హెచ్చరించారు. క్రోసూరులో బుధవారం అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలను ఆయన ఆపి, డ్రైవర్లను హెచ్చరించారు. మిర్చి కోతలకు కూలీలను తీసుకెళ్లే వాహనాలు, అధిక లోడులతో ఇసుక, మట్టి తరలించే ట్రాక్టర్లు, లారీల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ముందుగా హెచ్చరికలుంటాయని, తరువాత చర్యలుంటాయని హెచ్చరించారు. వాహనదారులు అధిక లోడులతో ప్రయాణాలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

అమరావతిలో...

అధిక లోడుతో ప్రయాణించే వాహనదారులపై చర్యలు తప్పవని పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో 36వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆటో డ్రైవర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కచ్చితంగా లైసెన్స్, పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ అచ్చయ్య, ఎస్ఐ అమీర్ పాల్గొన్నారు.



వాహనాలను ఆపి హెచ్చరిస్తున్న ఎస్ఐ నాగేంద్రరావు

నాళం మట్టపల్లి జీవితం యువతకు ఆదర్శం

రెంటచింతల:స్వాతంత్ర్య సమర యోధుడు, పల్నాటి గాంధీగా పేరు పొందిన నాళం మట్టపల్లి జీవితం నేటి యువతకు ఆదర్శమని గ్రామ పెద్దలు గొంటు ఆదిరెడ్డి, వాసవి అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నాళం మట్టపల్లి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రామాలయం సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నాళం మట్టపల్లి పల్నాడు ప్రాంతంలో చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం ఆరుగురు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందచేశారు. ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాళం పెదబాబు, నాళం సత్యనారాయణ, నాళం నరసింహారావు, వైఆర్ఎస్ స్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య, నాళం చిన బాబు, కొక్కెండ్ల బ్రహ్మం, బిక్షాలు, నారాయణపురం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నాళం మట్టపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

నెలాఖరులోపు లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలి



మాచర్ల: రిటైర్డ్ ఉద్యోగులు ఈ ఫిబ్రవరి నెలాఖరులోపు లైఫ్ సర్టిఫికెట్‌ను సబ్ ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని సబ్ ట్రెజరర్ కేతావత్ రామానాయక్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్క రిటైర్డ్ ఉద్యోగి నెలాఖరులోపు లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా అందించాలన్నారు. అలా అందించని పక్షంలో పింఛన్ ఆగిపోతుందని పేర్కొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లకు కిట్లు

మాచర్ల : పట్టణంలోని నేషనల్ యాక్షన్ ఆఫ్ మిషన్ శానిటేషన్ ద్వారా పట్టణంలోని ఆరుగురు సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లకు పురపాలక సంఘ కమిషనర్ డి.వేణుబాబు బుధవారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.

క్వారీకి మంచినీరు



మాచర్ల: నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా నీరు విడుదలైనప్పటి నుంచి పురపాలక సంఘ క్వారీ జలాశయంలో పంపింగ్ ద్వారా నీటిని నింపుతున్నారు. ఇప్పటికే నీటి మట్టం 15 అడుగులకు చేరుకుంది. మూడు నెలల పాటు ఇబ్బంది లేకుండా నీరు నిల్వ చేశామని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. మార్చి చివరి వరకు కుడికాలువకు నీరు విడుదలయ్యే అవకాశం లేకపోవడంతో క్వారీని నింపినట్టు వివరించారు.

పాస్టర్ కాటుపల్లి దంపతులకు డాక్టరేట్



దాచేపల్లి : మండలంలోని మాదినపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్, పల్నాడు బాప్టిస్ట్ ఫీల్డ్ కార్యదర్శి, టీబీసీసీ డైరెక్టర్ కాటుపల్లి డేవిడ్‌రాజ్, రూత్ కుమారి దంపతులకు డాక్టరేట్ ప్రదానం చేశారు. తెలుగు బాప్టిస్ట్ సంఘాల్లో 25 సంవత్సరాలు పాస్టర్‌గా డేవిడ్ రాజ్ దంపతులు చేసిన సేవలను అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ(ఎబీఎఫ్ఎంఎస్) గుర్తించింది. రెండు రోజుల క్రితం కందుకూరులోని ఏబీఎం చర్చిలో జరిగిన రామాయపట్నం బాప్టిస్ట్ థియాలాజికల్ 150వ వార్షికోత్సవంలో డేవిడ్‌రాజ్ దంపతులకు డాక్టరేట్‌ని ఎబీఎఫ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు పులుకూరి సుజయ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. డేవిడ్‌రాజ్ దంపతులను స్థానిక క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు అభినందించారు.

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలి



పిడుగురాళ్ల: ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బీవీ కృష్ణారెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముందుగా బాగా చదివిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆటలపోటీల విజేతలకు బహుతులు ఇచ్చారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం

– సీఐ శ్రీరాం వెంకట్రావు

పిడుగురాళ్ల: హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకమని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు హెచ్చరించారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ... నో హెల్మెట్, నో ఎంట్రీ నినాదంతో హెల్మెట్ లేనిదే పిడుగురాళ్ల పట్టణంలోకి ప్రవేశం కల్పించడం లేదని వివరించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి పట్టణంలోకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంపై వాహనదారుల అవగాహన కోసం బోర్డులను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శివనాగరాజు, ఎం.మోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ లేని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ శ్రీరాం వెంకట్రావు

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు

గురజాల : చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్‌లో కామ్రేడ్ నూతులపాటి ఫణి ఐదో వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. ఇల్లు లేని పేదలకు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయాలనే ఆలోచనతో ఉన్నారన్నారు. వెంటనే నరేంద్రమోదీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులను ఆదుకోవాలన్నారు. ముందుగా న్యూ డెమోక్రసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్ విష్ణు తదితరులు ఉన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

గురజాల రూరల్ : రైతులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి సూచించారు. గురజాల నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం 1, 2 పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతలు వ్యవసాయంలో వివిధ పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు తీసుకుని మంచి దిగుబడి సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో

పాఠశాలలో వసతులకు ఎస్‌బీఐ కృషి

పిడుగురాళ్ల: పాఠశాల అభివృద్ధి కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఎస్‌బీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని బీఆర్‌జీసీ ఎంపీపీఎస్ పాఠశాలలో సుమారు రూ.5 లక్షల విలువ గల వస్తువులను అందజేస్తున్నామని పిడుగురాళ్ల ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ బి.దేవీంద్రనాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో బెంచీలు, కంప్యూటర్లు, ప్రింటర్, మరుగుదొడ్ల మరమ్మతులతోపాటు విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ఆర్ఓ ప్లాంట్ సమకూర్చినట్టు వివరించారు. కార్యక్రమంలో నర్సరావుపేట ఆర్‌బీఓ చీఫ్ మేనేజర్ కేఎస్ఆర్ బాలాజీ, బీఆర్ఓ మేనేజర్ ఎం.గోపయ్య, పాఠశాల హెచ్ఎం వెంకట సుబ్బమ్మ, నాయకులు రామకృష్ణ, ఎం.కొండలు, ఎస్ఎంసీ చైర్మన్ రాము, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బెంచీలను అందజేస్తున్న ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్లు

జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించాలి

గురజాల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలికి ఉపాధి కల్పించాలని ఎంపీడీఓ గౌసియాబేగం ఫీల్డు అసిస్టెంట్‌లకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడతూ పని కావల్సిన ప్రతి ఒక్కరికీ ఉపాది హామీ పథకం ద్వారా పనిని కల్పించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి పనులు ఏమి చేయాలనే విషయాలనూ పరిశీలించాలన్నారు . ఉపాధి హామీ పథకం ద్వారా లభించే సంక్షేమ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందన్నారు.



ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వైఎస్సార్ సీపీ నేతకు మాజీ ఎమ్మెల్యే కాసు నివాళి

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాంత్ వర్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం జరిగిన సంస్మరణ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరై శ్రీకాంత్ వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. శ్రీకాంత్ వర్మ తమ్ముడు చిన్న, కుమారుడిని పిలిచి ధైర్యం చెప్పి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాసు వెంట వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీకాంత్ వర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఈ- పంట నమోదుకు 15 వరకే గడువు

నకరికల్లు: రబీలో ఈ- పంట నమోదు, ఫార్మర్ ఈకేవైసీ నమోదు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీతో గడువు ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని నకరికల్లు, శివాపురంతండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పిలక దశలో ఉల్లికోడు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10కేజీలు, ఫోరేట్ గుళికలు 5 కేజీలు చొప్పున 20కేజీల ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ సుభాని, వై.ప్రభాకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మాలపాడులో బుధవారం వ్యవసాయాధికారి ఎం.అరుణ ఆధ్వర్యంలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులపై ఆయన అవగాహన కల్పించారు. ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏవో దేవదాసు

మద్యం షాపులు దరఖాస్తుకు గడువు పొడిగింపు

సత్తెనపల్లి: గౌడ కులానికి రిజర్వ్ చేసిన మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈనెల 8 వరకు గడువు పొడిగించిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్ కుమార్ బుధవారం తెలిపారు. సత్తెనపల్లి సర్కిల్ పరిధిలో సత్తెనపల్లి మున్సిపాల్టీ, ముప్పాళ్ల, రాజుపాలెం మండలాలకు ఒక్కొక్కటి చొప్పున మూడు మద్యం షాపులు గౌడలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈనెల 8న సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ఈనెల 10న లాటరీ తీసి షాపుల కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ల, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com